JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 17-08-2025
Medchal - Malkajgiri । Sunday 17-08-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 84 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 84 । Pages : 8 । ₹: 5


## వచ్చే నెల నుంచి బ్యాగుల్లో రేషన్ బియ్యం




**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతుంది రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకి శుభవార్త చెప్పబోతుందని సమాచారం. మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేశారు కనుక.. ఆగస్టు వరకు రాష్ట్రంలో రేషన్ పంపిణీ ఆగిపోయింది. వచ్చె నెల అనగా సెప్టెంబర్ నుండి రేషన్ పంపిణీ తిరిగి ప్రారంభం కాబోతుంది. ఈ క్రమంలో రేషన్ తీసుకునే వారికి ఉచితంగా రేషన్ బ్యాగులను ఇవ్వనుంది. ఈ బ్యాగుల్లో సన్న బియ్యంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు కూడా ఉంటాయని తెలుస్తోంది. ఇప్పటికే ఈ బ్యాగులు రాష్ట్రంలోని అన్ని రేషన్ డిపోలకు చేరాయని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ నెల నుంచి రాష్ట్రంలోరేషన్ తీసుకునే వారికి సన్న బియ్యంతో పాటు ఈ ప్రత్యేకమైన బ్యాగులను ఉచితంగా ఇవ్వనున్నారు. ఈ బ్యాగును బయట కొనాలంటే రూ.50 వరకు ఉంటుంది. ఈ బ్యాగులపై సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ఫొటోలతో పాటుగా.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటో కూడా ఉంటుంది. అలానే ఈ బ్యాగు మీద ఇందిరమ్మ అభయ హస్తం పేరుతో ఆరు గ్యారంటీలకు సంబంధించిన వివరాలను కూడా ముద్రించారు.

## యాక్టర్ గా రజనీ 50 ఏళ్లు పూర్తి



**జయభేరి, చెన్నై ఆగస్టు 16:**

భారతీయ చలనచిత్ర రంగంలో విశేష ఖ్యాతి గడించిన అగ్ర కథానాయకుడు, సూపర్ స్టార్ రజనీకాంత్‌కు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నటుడిగా రజినీకాంత్ 50 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను అభినందిస్తూ ఒక ప్రకటన ...మిగతాది 2 లో

## ముగిసిన ట్రంప్.. రష్యా అధినేత పుతిన్ భేటీ

- అమెరికా గడ్డపై అడుగుపెట్టిన రష్యా అధినేతకు 'హీరో' లెవెల్లో స్వాగతం
- పుతిన్‌తో భేటీ వేళ తన సైనిక సత్తా ప్రదర్శించిన ట్రంప్



**జయభేరి, న్యూ డిల్లీ, ఆగస్టు 16 :**

;ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ భేటీ ముగిసింది. అలస్కా వేదికగా జరిగిన ఈ సమావేశం ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే దిశగా ఉంటుందని అంతా భావించారు. అయితే, ఎలాంటి ఒప్పందం లేకుండానే ఇద్దరి మధ్య చర్చలు ముగిశాయి. ఇక ఈ భేటీ ...మిగతాది 2 లో



# అధికారులు.. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉంచాలి
### ఎన్ డిఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలి
### ఎప్పటికప్పుడు జలాశయాలను అధికారులు పరిశీలిస్తూ ఉండాలి
### భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ :**


భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఉదయం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు, 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. తాజా పరిస్థితులపై అధికారులతో మాట్లాడినప్పుడు ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉంటూ, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలి. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, ...మిగతాది 2 లో




*ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడ్ న్యూస్ వినిపించారు. డీఎస్సీ అభ్యర్థులకు తీపికబురు వినిపించారు. ఏపీ మెగా డీఎస్సీ ఫలితాలను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ నెలాఖరు నాటికి డీఎస్సీ నియామకాలను పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మెగా డీఎస్సీ ద్వారా సుమారుగా 16 వేలకుపైగా ఉపాధ్యాయుల భర్తీని చేపడుతున్నారు. ఈ నియామకాలకు సంబంధించిన డీఎస్సీ పరీక్షలను జూన్ నుంచి జూలై వరకు నిర్వహించగా.. డీఎస్సీ ఫలితాలను ఇటీవల ప్రకటించారు. మిగతా ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి ఆగస్ట్ నెలాఖరు నాటికి డీఎస్సీ నియామకాలు చేపడతామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.*

**జయభేరి, విజయవాడ :**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడిన ఆయన రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. 201419 మధ్యకాలంలో దేశంలోనే టాప్ త్రీ రాష్ట్రాలలో ఏపీని నిలిపామన్న చంద్రబాబు.. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దెబ్బతీసిందని ఆరోపించారు. ఏపీ బ్రాండ్‌ను నాశనం చేశారన్న చంద్రబాబు.. రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం పాలనతో పోలవరం, అమరావతి నిలిచిపోయాయని.. రాష్ట్రానికి పెట్టుబడులు ఆగిపోయాయని విమర్శించారు. 2024 ఎన్నికల్లో ఏపీ ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ఎన్డీఏ కూటమికి అధికారాన్ని అప్పగించారన్న చంద్రబాబు.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పథకం కింద రాష్ట్రంలోని 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరించారు. విద్యార్థులను బడికి పంపే తల్లులకు తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామన్న చంద్రబాబు.. రాష్ట్రంలోని 47 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నామని వివరించారు. దీపం 2 పథకం కింద మహిళలకు ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని.. నేటి నుంచి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చంద్రబాబు వివరించారు. ...మిగతాది 2 లో



## కడెం ప్రాజెక్టులో వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన యువకుడు..!

**జయభేరి, కడెం :**

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జిల్లాలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో.. ప్రధాన నదులు, ప్రాజెక్టులకు భారీగా వరద నీరు చేరుతోంది. ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు ప్రమాదకర స్థాయిలో వరద పోటెత్తింది. దీంతో అధికారులు ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ వరద ప్రవాహానికి తిప్పిరెడ్డి గంగాధర్ అనే యువకుడు కొట్టుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. గంగాధర్ చేపల వేట కోసం వెళ్ళి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

యువకుడిని రక్షించడానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే.. వరద ఉధృతి అధికంగా ఉండటం వల్ల సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. నీటి ప్రవాహం వేగంగా ఉండటంతో గాలింపు చర్యలు కష్టతరంగా మారాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అతడిని గుర్తించడానికి ప్రత్యేక పరికరాలను ఉపయోగిస్తున్నాయి. గంగాధర్ కోసం అతడి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ప్రాజెక్టు వద్ద ఆందోళనగా ...మిగతాది 2 లో



## ఉప్పల్‌లో దారుణం..

### ఐదేళ్ల బాలుడిపై లైంగిక దాడి, దారుణ హత్య..!

**జయభేరి, ఉప్పల్ :**

ఐదేళ్ల బాలుడిని అత్యంత పాశవికంగా లైంగిక దాడి చేసి హత్య చేసిన ఘటన హైదరాబాద్ ఉప్పల్‌లో చోటుచేసుకుంది. ఈనెల 12వ తేదీన మిస్సైన ఈ బాలుడు తాజాగా విగత జీవిగా స్థానిక చెట్ల పొదల్లో కనిపించాడు. స్థానికంగా నివసించే ఓ వ్యక్తి టింబర్ డిపోలో పనిచేస్తూ ఉంటాడు. అతని కుమారుడు ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. బాలుడి తల్లిదండ్రులు ఉప్పల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆ బాలుడిని కమర్ అనే వ్యక్తి మాయ మాటలు చెప్పి తీసుకెళ్లినట్లు తెలుసుకున్నారు. చనిపోయిన బాలుడి కుటుంబం చత్తీస్‌గఢ్‌కు చెందింది. వీళ్ళు గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని రామంతపూర్ పరిధిలో ఉంటున్నారు. అయితే వారి ఇంటి సమీపంలో ఉండే బీహార్ కు చెందిన కమర్ అనే వ్యక్తి ఈ దారుణానికి ఒడిగట్టాడు. సీసీ టీవీ ఫుటేజ్ లో అతడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా లైంగిక దాడి చేసి బాలుడిని గొంతునులిమి హత్య చేసి ముళ్ల పొదల్లో చంపి పడేసినట్లు అంగీకరించాడు. ఇక శుక్రవారం రాత్రి నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు బాలుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ...మిగతాది 2 లో

## ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఎన్డీయే భేటీ



**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 16:**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామంతో దేశంలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం మారిపోయింది. ఉపరాష్ట్రపతి పదవికి జగ్‌దీప్ ధన్కడ్ రాజీనామా దేశంలో సరికొత్త చర్చకు దారితీసింది. ఈలోగా ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం తేదీలు ఖరారు చేయడంతో భారత చరిత్రలో ఇది రెండవ మధ్యంతర ఉపరాష్ట్రపతి ఎన్నికగా నిలుస్తుంది. ఇప్పుడు కాబోయే ఉపరాష్ట్రపతి ఎవరు అన్న అంశంపైనే విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుత సంఖ్యాబలం ప్రకారం అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ కూటమికి చెందిన అభ్యర్థే గెలుపొందే అవకాశాలు ఉన్నందున.. ఆ కూటమిలో జరుగుతున్న కసరత్తు ఆసక్తికరంగా మారింది. తాజాగా జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఇదే అంశంపై చర్చించి.. నిర్ణయాధికారాన్ని కూటమి పెద్దన్న భారతీయ జనతా పార్టీ అగ్రనాయకత్వానికే అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాకు ఈ నిర్ణయాధికారాన్ని కట్టబెడుతూ తీర్మానం కూడా చేశారు. అంటే పార్లమెంట్ ఉభయసభల్లో సభా నాయకులుగా ఉన్న ఈ ఇద్దరు ప్రభుత్వ శాసన వ్యూహాల్లో కీలక పాత్ర ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## అప్రమత్తంగా ఉండాలి

చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాల. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలి. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలి. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలి. వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలి. అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలి. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలి.

## కడెం ప్రాజెక్టులో వరద ప్రవాహానికి..

ఎదురుచూస్తున్నారు. ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో నదులు, ప్రాజెక్టుల వద్దకు వెళ్లవద్దని అధికారులు పదేపదే హెచ్చరించినా, కొందరు ప్రజలు వాటిని పట్టించుకోవడం లేదు.

**ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, అధికారుల సూచనలు..**

కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం అది 693.700 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా, ఇప్పుడు 3.224 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి 86,994 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అధికారులు 17 గేట్లు ఎత్తి 1,56,376 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అధికారులు ప్రజలను నది పరివాహక ప్రాంతాలకు, ప్రమాదకరమైన ప్రదేశాలకు దూరంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని సూచిస్తున్నారు.

## ఉప్పల్‌లో దారుణం..

ఆసుపత్రికి తరలించారు. బాలుడు మృతితో వారి కుటుంబం అంత శోక సంద్రంలో మునిగిపోయింది. ఇలా దారుణాలకి ఇంటి చుట్టుముట్టువారు ఒడిగడితే తల్లిదండ్రులు పిల్లల్ని ఒంటరిగా వదిలి ఉండగలుగుతారు. అందుకే తల్లిదండ్రులు అలర్ట్ గా ఉండాలని పోలీసులు కూడా తెలియజేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే సిసిటివి అమర్చుకోవాలి. దీంతో పాటు పెట్రోలింగ్ వంటివి కూడా కాస్త గట్టిగా నిర్వహించాలని కూడా స్థానికులు చెబుతున్నారు.స్థానికుల కూడా నిందితుడికి తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. న్యాయం ఆలస్యం అవటం వల్ల కేసు చేయి జారిపోయే ప్రమాదం ఉందని స్థానికులు డిమాండ్ చేశారు. ఇలాంటి దారుణ ఘటనలు అడపాదడపా బయటికి వస్తూనే ఉన్నాయి. ఎలాంటి చర్యలు తీసుకున్నా దారుణాలు ఆగడం లేదు. పసిబిడ్డల ప్రాణాలు తీయడానికి ఒడిగడుతున్నారు.

## ఏపీ సీఎం మరో గుడ్ న్యూస్..

ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాగా మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేశామన్న చంద్రబాబు.. ఈ నెలాఖరు కల్లా నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25 వేలకు పెంపు.. 4000 సెలూన్లకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, కల్లుగీత కార్మికులకు పది శాతం లిక్కర్ షాపులు, బార్లు, మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం , చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ . పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని సీఎం నారా చంద్రబాబు నాయుడు వివరించారు. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా పాలన అందించాలనే ఉద్దేశంతో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ తీసుకువచ్చినట్లు చంద్రబాబు వివరించారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 700 పౌరసేవలు అందిస్తున్నట్లు చంద్రబాబు వివరించారు.

## ముగిసిన ట్రంప్.. పుతిన్ భేటీ

సందర్భంగా ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. దాదాపు సంవత్సరాల తర్వాత అమెరికా గడ్డపై అడుగుపెట్టిన రష్యా అధినేతకు 'హీరో' లెవెల్లో స్వాగతం లభించింది.ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని పుతిన్ ఆపకపోతే అత్యంత తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ ఇటీవలే తీవ్ర హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. అయితే, తాజా భేటీలో ట్రంప్ వైఖరి పూర్తిగా మారిపోయింది. భేటీకి రెండు రోజులు తీవ్రస్వరంతో బెదిరించిన అమెరికా అధ్యక్షుడు.. పుతిన్‌ను చూడగానే ఆప్యాయంగా పలకరించారు. రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికారు. ఈ పర్యటన వేళ పుతిన్‌కు దాదాపు నాలుగు యూఎస్ ఫైటర్ జెట్‌లతో స్వాగతం లభించింది.రష్యా అధ్యక్షుడికి ట్రంప్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి చిరునవ్వుతో పలకరించారు. ఇద్దరూ చాలా ఆత్మీయంగా కన్పించారు. ఇక ట్రంప్‌తో కలిసి 'బీస్ట్' వాహనంలో పుతిన్ ప్రయాణించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇద్దరూ బీస్ట్‌లో వెనుక సీట్లో కూర్చుని సమావేశ వేదిక వద్దకు వెళ్లారు. 10 నిమిషాల ఈ ప్రయాణంలో ట్రంప్ మాట్లాడుతుండగా పుతిన్ మాత్రం చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు.

మరోవైపు పుతిన్‌తో భేటీ వేళ ట్రంప్ తన సైనిక సత్తా ప్రదర్శించారు. ఈ భేటీకి ముందు అలాస్కాలోని జాయింట్ బేస్ ఎల్మెండార్ఫ్‌రిచర్డ్‌సన్ సైనిక స్థావరానికి తొలుత ట్రంప్ చేరుకున్నారు. ఆ తర్వాత కాసేపటి పుతిన్ అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పుతిన్‌కు ట్రంప్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. అయితే, పుతిన్‌ను చిరునవ్వుతో పలకరించిన ట్రంప్.. అదే సందర్భంలో తన 'పవర్ ప్లే' చూపించారు. ట్రంప్, పుతిన్ పోడియం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. వారిపైనుంచి బీ2 బాంబర్లు దూసుకెళ్లాయి. అంతేకాదు, వీరు వెళ్తున్న మార్గంలో యుద్ధ విమానాలను వరుసగా పార్క్ చేసి ఉంచారు. ఇది చూసి పుతిన్ ఒక్కసారిగా అవాక్కయ్యారు.ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలను చూసిన నెటిజన్లు, పలువురు ప్రముఖులు పుతిన్‌కు ట్రంప్ అమెరికా సైనిక సత్తాను పరోక్షంగా చూపించారు అంటూ మాట్లాడుకుంటున్నారు. కాగా, ఇటీవలే ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం సందర్భంగా టెహ్రాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసేందుకు అమెరికా ఈ బీ2 బాంబర్లను ఉపయోగించిన విషయం సంగతి తెలిసిందే.

## యాక్టర్ గా రజనీ 50 ఏళ్లు పూర్తి

విడుదల చేశారు. సినీ రంగంలో స్వర్ణోత్సవం జరుపుకుంటున్న రజినీకాంత్‌కు ఇది అరుదైన గౌరవమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.వెండి తెరపై 'సూపర్ స్టార్ రజని' అని టైటిల్ కనిపించగానే థియేటర్ ఏ విధంగా మారుమోగుతుందో పలుమార్లు చెన్నైలో చూశాను. తరాలు మారుతున్నా సినీ ప్రియుల్లో ఆ ఆనందోత్సాహాల వన్నె తగ్గలేదు. ఆ స్థాయి అభిమానులను దక్కించుకున్న అగ్రశ్రేణి కథానాయకుడు రజనీకాంత్ నటుడిగా 5 దశాబ్దాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. సినీ జీవితంలో స్వర్ణోత్సవం చేసుకుంటున్న సూపర్ స్టార్ రజనీకాంత్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు.నటుడిగా ఆయన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. ప్రతినాయక పాత్ర పోషించినా, కథానాయకుడిగా మెప్పించినా రజనీకాంత్ తనదైన స్టైల్ ను చూపించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారు. ఆయన నడకలో, సంభాషణలు పలకడంలో, హావభావ విన్యాసంలో ప్రత్యేకతను చూపిస్తారు. రజనీకాంత్ స్టైల్స్ కి నవతరం ప్రేక్షకుల్లోనూ అభిమానులున్నారు. నటుడిగా శిఖరాగ్ర స్థాయికి చేరిన రజనీకాంత్ గారు మహావతార్ బాబాజీ భక్తుడిగా ఆధ్యాత్మిక విషయాలపై, యోగా సాధనపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ఆయనలో భక్తి భావాన్ని, ధార్మిక విశ్వాసాలను తెలియచేస్తుంది. నటుడిగా స్వర్ణోత్సవ సంబరాలు చేసుకుంటున్న రజనీకాంత్ గారు మరిన్ని విభిన్న పాత్రలతో సినీ ప్రియులను మెప్పించాలని ఆకాంక్షిస్తున్నాను. రజనీకాంత్ గారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు అందించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# ఇక జియో పొలిటికల్ షిఫ్ట్..



రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు అంటూ ఉండరంటారు కదా.. అయితే ఇది కొన్ని సందర్భాల్లో దేశాలకూ వర్తిస్తుంటుంది. ప్రత్యర్థిగా భావిస్తున్న దేశాలతోనే జట్టుకట్టే పరిస్థితి ఉండొచ్చు. ఇప్పుడు భారత్ - చైనా బంధం చూస్తుంటే ఇదే నిజమనిపిస్తోంది. ఓవైపు ట్రంప్ దూకుడు భారత్, చైనాకు చాలానే కలిసి వస్తోంది. జియోపొలిటికల్ షిఫ్ట్ అనేది ఒకటి ఉంటుంది. ట్రంప్ కారణంగా ఇది వర్కవుట్ అవుతోంది.భారత్ చైనా మధ్య స్నేహబంధం. ఒక నమ్మకం సరికొత్త బంధానికి పునాది వేస్తుంది. ఒక అవకాశం.. సత్సంబంధాలను పెంచుతుంది. ఒక అవసరం కలిసి నడిచేలా చేస్తుంది. ఇది ఇప్పుడు భారత్ చైనాకు వర్తిస్తుంది. ఎందుకంటే 2020లో గాల్వన్ లోయలో ఘర్షణ తర్వాత కథ అంతా మారిపోయింది. దూరం పెరిగింది. అయితే ఆ దూరం ఎప్పుడూ అలాగే ఉండదు కదా. ఇటీవలి పరిస్థితులు కలిసి వచ్చాయి. రెండు దేశాల మధ్య మళ్లీ కొత్తబంధం చిగురించేలా చేశాయి. భారత ఉత్పత్తులపై ట్రంప్ 50 శాతం టారిఫ్‌లు విధించిన తర్వాత ఈ రెండు దేశాలు దగ్గరవుతున్నాయని ఇప్పుడు అనుకుంటున్నారు. అయితే మార్చిలో చైనాపై 20 శాతం ట్రంప్ టారిఫ్ లు విధించినప్పుడే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. అమెరికా ఓవరాక్షన్ కు చెక్ పెట్టేందుకు, పవర్ పాలిటిక్స్ ను అడ్డుకునేందుకు కలిసి పని చేద్దామన్నారు. అప్పటి నుంచే భారత్ - చైనా మధ్య పరిస్థితులు అనుకూలించడం మొదలైంది. చెప్పాలంటే మొదట ఒక మెట్టు చైనానే దిగింది. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి రాక. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఢిల్లీకి వస్తున్నారు. జాతీయ భద్రతా సలహాదారు దోవల్ తో భేటీ అవుతారు. ఈనెల 31న ప్రధాని మోడీ చైనా పర్యటన కంటే ముందుగానే ఈ పరిణామం చోటు చేసుకుంటుండడం ఆసక్తికరంగా మారుతోంది. ఎందుకంటే మాట్లాడుకునేవి చాలా ఉన్నాయి. పరిష్కరించుకునేవీ ఉన్నాయి. సో ఇటీవలి కాలంలో భారత్ చైనా ప్రతినిధులు, ప్రభుత్వ వర్గాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయి. రాజకీయంగా పరస్పర విశ్వాసం పెంచుకోవడం, సహకారాన్ని విస్తరించడం ఇవన్నీ రెండు దేశాల మధ్య బంధాన్ని మరో లెవెల్ కు తీసుకెళ్లేలా కనిపిస్తున్నాయి ట్రంప్ టారిఫ్‌లకు చెక్ పెడుదామని చైనా ముందుకు రావడం, ప్రధాని మోడీ ఏడేళ్ల తర్వాత చైనాకు వెళ్లాలని డిసైడ్ అవడం, సరిహద్దు వాణిజ్యం మళ్లీ ప్రారంభించాలని అనుకోవడం, బార్డర్ లో పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించడం, డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభించాలనుకోవడం, చైనీస్ పౌరులకు టూరిస్టుల వీసాల మంజూరుపై ముందడుగు పడడం, చైనా కంపెనీల పెట్టుబడుల నిబంధనలను సడలించాలనుకోవడం ఇవన్నీ కీలక పరిణామాలుగా కనిపిస్తున్నాయ్. సరిహద్దు వాణిజ్యం మళ్లీ మొదలు పెట్టేలా చర్చలు. ఓవరాల్ గా చూస్తే భారత్ చైనా మధ్య సరిహద్దు వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాల్లో మెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఏర్పడిన ఉద్రిక్తతల నుంచి రిలీఫ్ కనిపిస్తోంది. ఈ సంబంధాలు పెరగడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలు, భారత్‌పై విధించిన అధిక టారిఫ్‌లు కీలకంగా మారాయి. ఫస్ట్.. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నిలిపేసిన సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ ట్రేడ్ ఉత్తరాఖండ్ లిపులేఖ్ పాస్, హిమాచల్ ప్రదేశ్ షిప్కీ లా పాస్, అలాగే సిక్కిం నాథు లా పాస్ ఇలా మూడు హిమాలయన్ సరిహద్దుల ద్వారా జరుగుతుంది.

ఈ సరిహద్దు వాణిజ్యం విలువలో చిన్నదైనప్పటికీ రెండు దేశాల మధ్య సామాజిక ఆర్థిక సంబంధాలను మెరుగుపరచడంలో కీ సిగ్నల్ గా ఉంది. సో ఇది త్వరలో ప్రారంభించాలనుకోవడంపై చైనా రియాక్ట్ అయింది. ఈ వాణిజ్యంతో సరిహద్దు ప్రాంత వాసుల లైఫ్ క్వాలిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నది చైనా. 2020కి ముందున్న పెట్రోలింగ్ విధానం పునరుద్ధరణ. భారత్ చైనా మధ్య దౌత్యపరమైన పురోగతి కూడా కనిపిస్తోంది. 2024 అక్టోబర్‌లో కుదిరిన ఒప్పందంతో 2020కి ముందు ఉన్న పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించారు. ఐదేళ్ల తర్వాత ఇదొక కీలక ముందడుగుగా మారింది. అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 31న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ - SCO సమ్మిట్ కోసం చైనాకు వెళ్లనున్నారు. ఏడేళ్ల తర్వాత చైనా పర్యటనకు మోడీ వెళ్తుండడం ఇదే తొలిసారి. ఈ టైంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీ జరగనుంది. అటు 2020 నుండి నిలిపేసిన డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభంకానున్నాయి. రెడీగా ఉండాలని విమానయాన సంస్థలకు కేంద్రం సూచించింది కూడా. చైనాతో భారత్‌కు 85 బి. డాలర్ల వాణిజ్య లోటు. సో ఈ ప్రయత్నాలన్నీ ఆర్థిక దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక ముందడుగుగా మారుతాయి. వాణిజ్యం, చర్చలను తిరిగి ప్రారంభించడం ద్వారా రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించడానికి సహకారాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడనున్నాయి. అటు వాణిజ్య బంధంపైనా ఫోకస్ పెడుతున్నాయి. 2023, 24లో భారత్‌కు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ద్వైపాక్షిక వాణిజ్యం 118.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే ఇండియా 85 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది. దీనిని తగ్గించేందుకు చైనాలో మన మెడిసిన్స్, అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ యాక్సెస్‌ను పెంచాలని భారత్ కోరుతోంది. సో రాబోయే రోజుల్లో అన్నీ జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికాను ఎదుర్కోవడం చైనాకు కీలకం. అందుకు భారత్ సపోర్ట్ కావాలి. అదే సమయంలో మన ప్రాధాన్యతలకు మనకు ఉన్నాయి. అయితే చైనాను పూర్తిగా నమ్మకుండా జాగ్రత్తగా వ్యవహరించడమే కీలకమైన విషయం. ట్రంప్ టారిఫ్‌లతో మారిన కథ. కొన్ని అవకాశాలు ఆటోమేటిక్ గా కలిసి వస్తాయి. ఇప్పుడు భారత్ చైనా సంబంధాల మెరుగువడంలో కూడా చాలానే కలిసి వచ్చాయి. ఈ రెండు దేశాల దౌత్య సంబంధాలకు ఈ ఏప్రిల్ లో 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు, భారత రాష్ట్రపతి పరస్పర అభినందనలు తెలుపుకోవడం దగ్గర్నుంచి ఇప్పుడు స్ట్రాటజిక్ రీ సెట్ దాకా చాలా పరిణామాలు జరుగుతున్నాయ్. రష్యా నుంచి ఆయిల్, ఆయుధాలు కొనడం ఆపకపోతే భారత్ పై 50 శాతం టారిఫ్ లు వేస్తానని ట్రంప్ ప్రకటించిన తర్వాత కథ మారింది. ఇది భారత్ అమెరికా సంబంధాలపై చాలా ఎఫెక్ట్ చూపింది. ఓవైపు పాకిస్తాన్ ను అమెరికా దగ్గర తీస్తోంది. ఇటు భారత్ చైనా మధ్య పొలిటికల్ షిఫ్ట్ కనిపిస్తోంది. చైనాపై 20 శాతం సుంకాలు, భారత్ పై 50 శాతం సుంకాలు విధించారు ట్రంప్. దీంతో ఈ రెండు దేశాలు అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టే దిశగా కదులుతున్నాయి. తాజాగా ప్రధాని మోడీ ఇండిపెండెన్స్ డే స్పీచ్ లోనూ మనం ప్రపంచ మార్కెట్లలో మన సత్తా చాటుకోవాల్సిన టైం వచ్చిందని గుర్తు చేశారు. భారత్ - చైనా వాణిజ్య సంబంధాల మెరుగుదల. ట్రంప్ అమెరికా ఫస్ట్ అన్న విధానం అలాగే అధిక సుంకాలు భారత్ - చైనా మధ్య వాణిజ్య సంబంధాలు పెరగడంలో కీలక పాత్ర పోషించింది. సో తమ ఉత్పత్తులకు అమెరికా చెక్ పెడితే.. భారత్ మాత్రం అన్ని ప్రత్యామ్నాయ ఆప్షన్లు చూస్తోంది. అందుకే డైవర్సిఫికేషన్ రూల్ ఫాలో అవుతోంది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడికి ఉత్పత్తుల్ని షిఫ్ట్ చేసే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగానే చైనాతో వాణిజ్య బంధంపై ముందడుగు వేస్తోంది. చైనీస్ పెట్టుబడులపై ఆంక్షలను సడలించడం, వాణిజ్య మార్గాలను తెలవడం వంటి చర్యలకు ఓకే చెబుతోంది. క్లియర్ గా చెప్పాలంటే ట్రంప్ విధానాలు భారత్‌చైనా సంబంధాలను స్ట్రాటజిక్ రీసెట్ వైపు నడిపిస్తున్నాయి. భారత్ అమెరికాతో బలమైన సంబంధాలను కొనసాగిస్తూనే, చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంచడం ద్వారా ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. అందుకే ఇవన్నీ జరుగుతున్నాయి. అంతకు ముందు కైలాస శిఖర దర్శన, మానస సరోవర యాత్రకు అడ్డంకులు తొలగించారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఎన్డీయే భేటీ



పోషిస్తున్నందున భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిని ఎన్నుకునే అధికారాన్ని కట్టబెట్టారు. అయితే బీజేపీలోని అత్యుతన్న నిర్ణయాత్మక విభాగం (బీజేపీ పార్లమెంటరీ బోర్డు) ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేయడం కోసం ఈ నెల 17న సాయంత్రం గం. 6.00కు సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి రేసులో ఎవరున్నారన్న చర్చ ఊపందుకుంది.ఉపరాష్ట్రపతి ఎన్నిక పార్లమెంట్ ఉభయ సభల ఎంపీలు కలిసి ఓటు వేసే అరుదైన సందర్భాలలో ఒకటిగా నిలుస్తుంది. సెప్టెంబర్ 9న జరగనున్న ఈ ఎన్నిక జరగనుంది. ఇటువంటి ఎన్నిక్లో పార్టీల సంఖ్యాబలాలు ముఖ్యమైనవి. కానీ ప్రస్తుత పరిస్థితిలో ఎన్డీఏకు అత్యంత సౌకర్యవంతమైన ఆధిక్యం ఉంది. ఈ పరిస్థితుల్లో అధికార కూటమికి గెలుపు వ్యూహాలను పదునుపెట్టి సంఖ్యాబలాన్ని కూడగట్టాల్సిన అవసరం లేదు. కానీ ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే విషయంలో ఒక రాజకీయ సందేశాన్ని పంపాల్సి ఉంటుంది. ప్రాంతం, కులం, భావజాల మూలాలు, కూటమి లెక్కలను సమన్వయం చేయడంతో పాటు ఇంకా అనేక సమీకరణాలను బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది.పార్లమెంటులో ఎన్డీఏ సంఖ్యాబలాన్ని ఒకసారి పరిశీలిస్తే.. రాజ్యసభలో బీజేపీకి 102 సీట్లు ఉండగా మిత్రపక్షాలైన జేడీ(యూ), ఏఐఏడీఎంకే, తెలుగుదేశం, ఎన్పీఎఫ్ మరియు ఇతర మిత్రపక్షాలతో కలిసి మొత్తం 239 సీట్లలో ఎన్డీయే బలాన్ని 132 సీట్లకు చేరింది. రాజ్యసభలో ఏడుగురు నామినేటెడ్ సభ్యులు కూడా ఓటు వేయడానికి అర్హులు. సాధారణ పరిస్థితుల్లో నామినేటెడ్ ఎంపీలు అధికారక కూటమికే మొగ్గు చూపుతుంటారు. ఈ సంఖ్యను కూడా కలుపుకుంటే అధికార కూటమి సంఖ్య 139కు చేరుతుంది. మిగతా సభ్యుల్లో అటు అధికార, ఇటు ప్రతిపక్ష కూటముల్లో లేని తటస్థ రాజకీయ పార్టీలకు చెందిన పార్టీల నేతలు కూడా ఉన్నారు. వారిలో కొందరు అధికార కూటమికి మద్దతు పలికే అవకాశాలు సైతం లేకపోలేదు.ఇక లోక్‌సభలో బీజేపీకి 240 మంది సభ్యులు, మిత్రపక్షాల 53 సీట్లతో కలిపి మొత్తం 542 మందిలో ఎన్డీయే బలం 293కు చేరుతుంది. రెండు సభలు కలిసి ఓటు వేసినప్పుడు, విజయానికి అవసరమైన సింపుల్ మెజారిటీని ఎన్డీయే సులభంగా అధిగమిస్తుంది.

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమి లో కాంగ్రెస్ నుంచి 99 లోక్‌సభ ఎంపీలు, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మద్దతు కలిపినా సరే ఎన్డీఏ ఆధిపత్యాన్ని దెబ్బకొట్టడం కష్టం.భారత ఉపరాష్ట్రపతి, పార్లమెంటులోని రాజ్యసభకు ఎక్స్‌అఫీషియో చైర్మన్ కావడం వల్ల ఈ పదవికి అభ్యర్థిని ఎంపిక చేయడం అధికార కూటమికి వ్యూహాత్మకంగా మారుతుంది. ఎందుకంటే రాజ్యసభలో ప్రతిపక్షాలను అదుపుచేస్తూ సభా కార్యకలాపాలను సజావుగా నిర్వహించడంలో ఆ పదవిలో కూర్చునే వ్యక్తి శక్తి, సామర్థ్యాలు కీలకంగా మారతాయి. అన్నీ ఆలోచించి నాడు ఉపరాష్ట్రతిగా జగ్‌దీప్ ధన్కడ్‌ను ఎంపిక చేసినప్పటికీ.. ఆయన తన అధికార పరిధిని అతిక్రమించి ప్రభావం చూపాలని ప్రయత్నించారనే ఊహాగానాలు చర్చలోకి వచ్చాయి. అప్పట్లో ఉత్తరాదిన హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపగలిగే శక్తి, సంఖ్యాబలం కలిగిన జాట్ సామాజికవర్గాన్ని మచ్చిక చేసుకుని దగ్గర చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా ఆ సామాజికవర్గంలో పలుకుబడి కల్గిన విద్యావంతుడు జగ్‌దీప్ ధన్కడ్‌ను ఎంపిక చేసినట్టు కథనాలు వచ్చాయి. గతాన్ని పక్కనపెట్టి.. వర్తమానంలోకి వస్తే.. కొత్త ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో మోదీ, నడ్డాలు ఎన్నికల లెక్కలు, అంచనాలు, ఊహాగానాలకు అతీతంగా ఆలోచించే అవకాశం ఉంది. కీలకమైన పదవుల విషయంలో బీజేపీ అగ్రనాయకత్వం అందరి ఊహలను తలకిందులు చేస్తూ.. ఎవరూ ఊహించని వ్యక్తులను చివరి క్షణాల్లో తెరపైకి తెచ్చిన ఉదాహరణలు కోకొల్లలు.

ఈసారి ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఎలాంటి సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తారన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో కాంగ్రెస్ సొంతంగా అధికారంలో ఉన్నప్పుడైనా, యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ పేరుతో కూటమిగా అధికారంలో ఉన్నప్పుడైనా, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలైనా.. గవర్నర్లుగా పనిచేసినవారినో, కేబినెట్ మంత్రులుగా ఉన్నవారినో ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అంతేకాకుండా వివిధ నేపథ్యాల నుంచి వచ్చినవారు సైతం ఈ పదవిని నిర్వహించారు. మోదీ సారథ్యంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి తన కేబినెట్‌లో మంత్రిగా ఉన్న సీనియర్ నేత ఎం. వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టారు. ఆయన పదవీకాలం ముగిసిన తర్వాత జరిగిన ఎన్నికల్లో గవర్నర్‌గా పనిచేసిన జగ్‌దీప్ ధన్కడ్‌కు అవకాశం కల్పించారు. కానీ ఈసారి కచ్చితంగా ఈ తరహా నేపథ్యాలు కల్గినవారికే ఉపరాష్ట్రపతి పదవి ఇస్తారని ఊహించే పరిస్థితి లేదు.దశాబ్దకాలంగా బీజేపీ అనుసరించిన విధానాలు, వ్యూహాలను గమనిస్తే.. కీలక పదవులకు ఎంపిక చేసే అభ్యర్థుల ద్వారా రాజకీయంగా బీజేపీ పాదముద్రలను విస్తరించడానికి ఉపయోగించుకుంది. 2017లో ఉత్తరప్రదేశ్ నుంచి దళిత నాయకుడు రామ్ నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా ఎన్నుకున్నప్పుడు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎం. వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతిగా ఎన్నుకుని, ఉత్తర - దక్షిణ భారతదేశ సమతుల్యత పాటించింది.2022లో ఒడిశా గిరిజన నాయకురాలు ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా ఎన్నుకోవడంతో, రాజస్థాన్ జాట్ నాయకుడు జగదీప్ ధన్ఖర్‌ను ఉపరాష్ట్రపతిగా ఎన్నుకున్నారు. విభిన్న భౌగోళిక ప్రాంతాలు, కులాలు, సముదాయాలను కవర్ చేసే ఈ రొటేషన్ లాజిక్ ఒక అలిఖిత నియమంగా మారింది. అయితే, ఈసారి పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. ఎందుకంటే బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి, తన సంస్థాగత నిర్మాణాన్ని సమీక్షించడానికి సిద్ధమవుతున్న వేళ అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి ఎన్నిక తెరపైకి వచ్చింది. దీంతో ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక ద్వారా ఏర్పడే ఖాళీ, బీజేపీ జాతీయాధ్యక్షుడి ఎంపిక కసరత్తు.. ఇవన్నీ కేంద్ర మంత్రివర్గంలోనూ భారీ మార్పులు, చేర్పులకు ఆస్కారం కల్గించనుంది. ఉదాహరణకు 2017 మాదిరిగా కేబినెట్ మంత్రిని తీసుకొచ్చి ఉపరాష్ట్రపతి పీఠంపై కూర్చోబెడితే.. ఆ స్థానాన్ని భర్తీ చేయడం ద్వారా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అనివార్యంగా మారుతుంది.ఈసారి ఉపరాష్ట్రపతి పదవికి కచ్చితంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేపథ్యం కలిగినవారికే అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నేపథ్యం లేనివారికి పదవులు ఇచ్చినప్పుడు వారు పార్టీపై కృతజ్ఞత, విధేయతను ప్రదర్శించకుండా విమర్శకులుగా మారి పార్టీని ఇరకాటంలో పడేసిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు సత్యపాల్ మాలిక్‌ను గవర్నర్‌గా చేస్తే.. ఆయన కేంద్ర ప్రభుత్వంపైనే తీవ్రమైన విమర్శలు, నిరాధార ఆరోపణలు చేసి ఇబ్బందులు సృష్టించారు. ఆ తర్వాత జగ్‌దీప్ ధన్కడ్ సైతం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసేలా వ్యవహరించారు. అందుకే ఈ రాజ్యాంగ పదవులను ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగి, విధేయతను ప్రదర్శించే వ్యక్తులకే అవకాశం ఇవ్వాలన్న ఆలోచనకు బలం చేకూర్చుతోంది.ఈ సమీకరణాల ప్రకారం బిహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు అవకాశాలను సన్నగిల్లాయి. మితవాద ముస్లిం వర్గాలను ఆకట్టుకోడానికి ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఎంపిక ఒక వ్యూహాత్మక మార్గమని కొందరు సూచిస్తున్నప్పటికీ.. RSS నేపథ్యం లేకపోవడం ఆయకు మైనస్ పాయింట్‌గా మారింది. మ ఎవరిని తెరపైకి తెస్తారు అన్న చర్చ తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది. ప్రతిపక్షం ఖచ్చితంగా ఒక అభ్యర్థిని నిలబెట్టి, ఎన్డీఏ రాజకీయాలను లక్ష్యంగా చేసుకుని ఒక కథనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తుంది. ఎన్డీఏ తమ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఇండి కూటమి కూడా తమ అభ్యర్థిని ప్రకటించాలని చూస్తోంది. కానీ ఎన్డీఏ సంఖ్యాబలం కారణంగా, ఈ పోటీ కేవలం పేరుకే తప్ప ప్రతిపక్ష అభ్యర్థి గెలుపు సాధ్యం కాదని ఆ కూటమి నేతలందరికీ తెలుసు.

# పాలకుల నిర్లక్ష్యానికి ఇంకెంత మంది బలి కావాలి

- ఇర్ప లక్ష్మిది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే
- ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు కుంజ మహేష్
- చనిపోయిన కుటుంబాన్ని పరామర్శించని ఎమ్మెల్యే
- వేల కోట్ల రూపాయల గిరిజన ఉప ప్రణాళిక నిధులు ఏమవుతున్నాయి...?
- లక్ష్మీపురం గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మహేష్
- బ్రిడ్జి లేక పోవడం కారణంగానే ఆదివాసీ మహిళ మరణం
- పది లక్షలు ఎక్స్ గ్రేసియా చెల్లించాలని డిమాండ్



**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 16 :**

ఇర్ప లక్ష్మిది ప్రభుత్వ హత్యే అని ఆదివాసీ నవనిర్మాణ సేన ములుగు జిల్లా అధ్యక్షులు కుంజ మహేష్ రాష్ట్ర ప్రభుత్వం పైన తీవ్ర స్థాయిలో ఆరోపించారు.లక్ష్మిపురం నుండి మొట్ల గూడెం, రాచపల్లి,వెంకటాపురం వెళ్లే దారిలో వాగుఉందని అన్నారు.ఈ వాగుకు బ్రిడ్జి కట్టక పోవడం వల్ల వాగు దాటే క్రమంలో ఆదివాసీలు వరదలో కొట్టుకొని పోయి చనిపోతున్నట్లు తెలియ జేసారు.శనివారం ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు కుంజ మహేష్ లక్ష్మిపురం గ్రామాన్ని సందర్శించారు. చనిపోయిన లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.అనంతరం గ్రామ ఆదివాసీలతో మాట్లాడినారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఇర్ప లక్ష్మి చనిపోయిందని అన్నారు. పాలకుల నిర్లక్ష్యానికి ఇంకా ఎంతమంది ఆదివాసీలు బలి కావాల్సి వస్తుందో అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.విధి నిర్వహణ లోనే వాగు దాటుతూ ఉండగా లక్ష్మి చనిపోయినందున ఆమె కుటుంబానికి ప్రభుత్వం పది లక్షల రూపాయలు ఎక్స్ గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు.లక్ష్మి చనిపోయి నాలుగు రోజులు అయిన స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పి ఓ కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలవక పోవడం సిగ్గు చేటని అన్నారు. ఆదివాసీల చావులు వీధి కుక్కల చావుల కంటే హీనంగా ఉన్నాయని మండిపడ్డారు. ఆదివాసీలు వాగులు దాటుతూ చనిపోవడం ప్రజాపాలనా లక్ష్యమా.. అని ప్రశ్నించారు. వెంకటాపురం మండలానికి ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న లక్ష్మిపురం ఆదివాసీ గూడెం ఏ రకంగానూ అభివృద్ధికి నోచుకోలేదని ఆయన అన్నారు.లక్ష్మిపురం గ్రామానికి చెందిన ఇర్ప లక్ష్మి ఆశా వర్కర్ గా పని చేస్తోందని అన్నారు. బుధవారం ఆమె తన విధులు నిర్వర్తించుకోని ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామానికి అనుకోని ఉన్న పాలెం వాగు దాటుతూ అదుపు తప్పి నీళ్లలో పడి పోయి చనిపోయినట్టు కుటుంబ సభ్యులు తెలుపు తున్నారని ఆయన అన్నారు.కొంతమంది అధికారులు లక్ష్మి మరణాన్ని వక్రీకరిస్తూ ఉన్నట్టు ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు.లక్ష్మిపురం గ్రామం చుట్టూ వాగులు ఉన్నాయని అన్నారు. రోడ్డు మార్గం కూడా లేదని అన్నారు. వర్షాకాలం వస్తే బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నామని ఆదివాసీలు తమ గోడు చెప్పు కుంటున్నారని అన్నారు.
ఈ గ్రామంలో ప్రాథమిక పాఠశాల లేదన్నారు. ఆదివాసీ బిడ్డలను దశాబ్దాలుగా విద్యకు దూరం చేస్తూ ఉన్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఏటూరునాగారం ఐటీడీఏ అధికారులు ఆదివాసీల సమస్యలను గుర్తించడం లో అలసత్వం వహిస్తూ ఉన్నారని అన్నారు. ఆదివాసీ గూడెలకు విద్య, వైద్యం,త్రాగు నీరు, సాగు నీరు వంటి మౌలిక వసతులు కల్పించడంలో గిరిజనాభివృద్ధి సంస్థ విఫలం అవుతోందని విమర్శ చేశారు. కోట్ల రూపాయల జీతాలు ప్రతి నెల చెల్లిస్తూ ప్రాజెక్ట్ అధికారిగా ఐఏఎస్ లను పెట్టినా ప్రయోజనం శూన్యమని అన్నారు.రాష్ట్రం లో ఇప్పటి వరకు గిరిజనాభివృద్ధి శాఖా మంత్రిని కేటాయించక పోవడం సిగ్గు చేటన్నారు. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 12 వేల కోట్ల రూపాయలు గిరిజన సబ్ ప్లాన్ నిధులు కేటాయించి నట్టు ఆయన పేర్కొన్నారు. కేటాయింపులు తప్ప ఖర్చు పెట్టేది శూన్యం అన్నారు. స్వతంత్రం వచ్చి 79 ఏళ్ళు గడుస్తున్న ఆదివాసీ గూడెల్లో అభివృద్ధి జాడ దొరకడం అసాధ్యం అన్నారు. ప్రభుత్వానికి ఆదివాసీల పట్ల ఏ మాత్రం చిత్త లేదని విమర్శించారు.ఏళ్ల తరబడి లక్ష్మి పురం గ్రామ ఆదివాసీ బిడ్డలు విద్యకు దూరం అవ్వడానికి కారణం ప్రభుత్వం ఐటీడీ ఏ అధికారులే కారణం అన్నారు.ప్రజా పాలన.. బంగారు తెలంగాణ.. అభివృద్ధి చెందుతోంది ఇండియా.. అని పాలకులు ఇచ్చే నినాదాలు ఈ దేశ ములవాసులు అయిన ఆదివాసీలకు వర్తించవని పేర్కొన్నారు. ఈకార్యక్రమం లో కంతి శంకర్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘట్ కేసర్ లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..

**జయభేరి, ఘట్ కేసర్, ఆగస్టు 16:**

దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కొరకై శ్రీ మహా విష్ణువు భూ లోకంలో అవతరించి ధర్మ పాలన అందించిన శ్రీకృష్ణుడు జన్మించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘట్ కేసర్ పట్టణంతో పాటు పలు గ్రామాలలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఘట్ కేసర్ పట్టణంతో పాటు ఎన్ ఎఫ్ సీ నగర్, అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, మాదారం, మర్రిపల్లి గూడా, ఘనపూర్ గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బాలబాలికలు శ్రీకృష్ణుడు, గోపికల అలంకరణలతో సందడి చేశారు. బాలబాలికలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ తో కోలాటాలు ఆడి ఉట్టి కొట్టడాలను చేసి అందరిని అలరించారు. బాలబాలికలు అచ్చం శ్రీకృష్ణుడు గోపికల మాదిరిగా తయారు కావడంతో తల్లి దండ్రులు సంబుర పడ్డారు. ఉట్టి కొట్టడంలో శ్రీకృష్ణుడు గోపికలు ఉత్సాహకతను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అత్యున్నత ప్రదర్శన చేసిన బాలబాలికలకు ప్రజలు అభినందనలు తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా పలు ఆలయాలలో భక్తులు మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీకృష్ణుడు వేశాధారణలో బాహు ఋషి, ఆగస్థ్య ఋషి.

## షార్ట్ సర్క్యూట్ జరగడం బాధాకరం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి డివిజన్ పరిధిలోని సాయి కృష్ణ ఎంక్లేవ్ కి చెందిన శంకర్ గౌడ్ ఇల్లు షాట్ సర్క్యూట్ కారణంగా దగ్ధం కావడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. షార్ట్ సర్క్యూట్ జరగడం బాధాకరం అని ప్రభుత్వం నుండి వచ్చే సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, రాఘవ రెడ్డి, శ్రీనివాస్, శ్రీశైలం, ప్రసాద్ రెడ్డి, వెంకట్ , శంకర్ నాయక్, వేణు స్వామి, ఎల్లయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం



**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్లోలోని రాఘవేంద్ర కాలనీలో దాదాపు 10 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాఘవేంద్ర కాలనికి సంబంధించిన కాలనీ సంక్షేమ సంఘం, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం, మహిళా సంగం, ఆలయ కమిటీ, వాసులందరు కలసికట్టుగా ఉంటూ అతి తక్కువ స్థలంలోనే ఒక ప్రణాళికతో ఒకే చోట పోచమ్మ దేవాలయం, కాలనీ సంక్షేమ సంఘం భవనము, కాలనీ పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసుకోవడం అభినందించవలసిన విషయమని, కాలనీ వాసులందరూ ఓపెన్ జిమ్ పరికరాలను ఉపయోగించుకోవాలని వారు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమం లో కాలనీ సంక్షేమ సంఘం, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం, మహిళా సంగం, ఆలయ కమిటి సభ్యులు కాలనీవాసులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణుని దేవాలయంలో పూజలో జక్కిడి రఘువీర్ రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా మన మన్సూరాబాద్ డివిజన్ యాదవ సోదరుల ఆహ్వాన మేరకు మన మన్సూరాబాద్ పరిధిలోని డబల్ బెడ్రూం అపార్ట్మెంట్స్ లో ఉన్న శ్రీ కృష్ణ దేవాలయాని దర్శించి, ప్రత్యేక పూజలో పాల్గొని, ఆ కృష్ణుని దీవెనలు మనందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది జక్కిడి రఘువీర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బొల్లు యాదయ్య యాదవ్, కేశబోయిన మల్లేష్ యాదవ్, కేశబోయిన రవి యాదవ్, వల్లపు అరుణ్ బాబు యాదవ్, మంచి నాగేష్ యాదవ్, కేశబోయిన జగన్ యాదవ్, కేశబోయిన నాగేష్ యాదవ్, జెనిగె అఖిల్ యాదవ్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.



## కనుల పండువగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- చిన్ని కృష్ణుడు వేషధారణలో అలరించిన చిన్నారులు..
- ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమం

**జయభేరి, మేడ్చల్ :**

శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ యాదవ సంఘం అధ్యక్షుడు రాము యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను చిన్నికృష్ణుడు, రాధా వేషధారణలో తయారు చేసి సంబురపడ్డారు. ఈ వేడుకల్లో శ్రీకృష్ణుని పాటలతో మహిళలు కోలాటాలు ఆడిపాడారు. చిన్నారులు శ్రీ కృష్ణ, రాధ, గోపికల వేషధారణలతో అందరిని ఆకట్టుకున్నారు. పెరుగు ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నికృష్ణులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, యాదవ సంఘం సభ్యులు నర్సింగ్ యాదవ్, మల్లేష్ యాదవ్, మహేష్ యాదవ్, సంపత్ యాదవ్, సురేష్ యాదవ్, జగదీష్ యాదవ్, మురళి యాదవ్, మోహన్ యాదవ్, పిడుగుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.




## శృంగేరి శారదంబా అలయంలో ఘనంగా శ్రీమంతం వేడుకలు

**జయభేరి, ఖమ్మం:**

ఖమ్మం నగరంలోని శృంగేరి శారదాంబ ఆలయంలో అమ్మవారికి శ్రీమంతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శారదా మాతకు శ్రావణమాసంలో ఇలా శ్రీమంతం చేయడం ద్వారా సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది అని భక్తుల నమ్మకం . శంకర మఠంలోని శృంగేరి శారదాంబ అమ్మవారు సంతానం లేని వారికి సంతానం కల్పిస్తుంది . అమ్మ ఆదేశులకోసం శ్రావణమాసం లో జరిగే ఈ కార్యక్రమానికి సంతానం లేని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 16 :**




గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ పై దుబ్బరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను జిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ఖండించారు.ఈ మేరకు వెంకటాపురం మండల కేంద్రంలోని జీఎస్పీ కార్యకర్తల అత్యవసర సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గోండ్వానా సంక్షేమ పరిషత్ కు సుదీర్ఘ ఉద్యమ చరిత్ర ఉన్నదని గుర్తు చేశారు.చర్ల మండలానికి చెందిన దుబ్బ రాజు అనే వ్యక్తి తన స్వలాభం కోసం ఆర్థికంగా ఎదగడం కోసం దిక్కుమక్కు లేని గిరిజన అభ్యుదయ సేవా సంఘం ఏర్పాటు చేసుకొని చర్ల మండల కేంద్రంలోని బహుళ అంతస్తులపై ఎల్టిఆర్ నోటీసులు జారీ చేస్తే గిరిజ నేతరులతో బేరసారాలు ఆడుతూ ఆదివాసి చట్టాలను అపహాస్యం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గిరిజన సంఘం ఏర్పాటు చేసిన ఆదివాసీ నాయకుల పై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు.సంఘం బైలా ఏం చెబుతుందో ఒకసారి తెలుసుకొని విమర్శలు చేస్తే బాగుంటుందని ఆయన అన్నారు.
రాష్ట్ర అధ్యక్షుడు ని విమర్శించే ఇంకోసారి ఊరుకునేది లేదని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
ఇంకోసారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, దుబ్బలో కలిసిపోతావు అని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కార్మికులకు కూలి రేట్లు పెంచాలి

**జయభేరి, దేవరకొండ :**



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దేవరకొండ పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో గ్రామీణ ప్రాంతాల నుండి వస్తువు మహిళా కార్మికుల సమస్యలపై సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం యాంత్రికరణ పెరిగిన తర్వాత ఉపాధి లేక పట్టణాలకు భవన నిర్మాణ పనుల కోసం వలస వస్తున్నారని వారికి పనికి తగిన వేతనం అందడం లేదని పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలో 15 రోజులకు మించి పని దొరకడం లేదని ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పేర్లు నమోదు చేసుకొని పని కల్పించాలని డిమాండ్ చేశారు.
నిర్మాణ కార్మికుల అడ్డాప్రదేశాలలో మహిళలకు మౌలిక సదుపాయాలు బాత్రూంలు షెడ్లు ఏర్పాటు చేయాలని, ఇండ్లు లేని నిరుపేద నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి 120 గజాల స్థలం ఇచ్చి కేంద్రం 10 లక్షలు ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. పురుషులతో సమానంగా మహిళలు పనిచేస్తున్న ఇచ్చే కూలిలో వ్యత్యాసం ఉంటుందని సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉడుగుండ్ల రాములు మండల నాయకురాలు రెడ్డిమల్ల లక్ష్మమ్మ, తంగిరాల సైదమ్మ, మాచర్ల సునీత, రామావత్ జయసుధ, సుగుణమ్మ, లక్ష్మమ్మ ,యాదమ్మ, సోప్పెరా మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని వాజపేయికి నివాళి

**జయభేరి, మేడ్చల్ :**



మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అటల్ బిహారి వాజ్ పెయ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ వాజపేయి దేశానికి మూడుసార్లు ప్రధా ల్ని బాధ్యతలు చేపట్టి నిస్వార్థ రాజకీయ నాయకుడిగా అందరి మన్ననలు పొందిన నేత అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో అజాతశత్రువుగా అందరి మన్ననలు పొందిన నేత అని వాజపేయి ఆశయ సాధన కోసం ప్రధాని నరేంద్రమోడీ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలరుదొడ్ల మల్లికార్జున్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి చింతలపూడి రామారావు, ఉపాధ్యక్షులు గడీల వసంత్ రెడ్డి, మలిగే శ్రీకాంత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బత్తికడి నవనిత, భాజపా నాయకులు విక్రమ్, సుంకు నవీన్, ప్రదీప్, శ్రవణ్, విమాలేష్ పాన్డే, శివ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో వైకాపా నాయుకులు

- ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్,వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ గొల్లపేట గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ దేవాలయంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు పాల్గొని స్వామివారికి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉందని, ముందుగా ప్రజలందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు . ఆ శ్రీకృష్ణ భగవానుడు ప్రతి కుటుంబాన్ని ఆనందంతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నామన్నారు. గీతాసారంతో జీవితసారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడిని స్మరించుకోవడం అంటే మన కర్తవ్యాన్ని మనం గుర్తుచేసుకుని ముందుకు సాగడమేనన్నారు . ఏ విషయంలో అయినా మనకు స్ఫూర్తినిచ్చే శ్రీ కృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో మనం విజయం సాధించవచ్చున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకుడు,జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, నాయుడు పాలెం సర్పంచ్ కుండ్రాపు వరలక్ష్మి సీతారామయ్య , మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, వై.సి.పి నాయకులు పైల అప్పల నాయుడు, పెందుర్తి నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, 11 వార్డు మెంబర్ సారిపల్లి సోము నాయుడు, సారి పల్లి నేస్తాలు, ముత్యాల నాయుడు మాస్టారు,ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సమ్మంగి జన్మదిన వేడుకలు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం సచివాలయం లో సమ్మంగిపాలెం జనసేన పార్టీ దళిత నాయకులు సమ్మంగి సోమేశ్వరరావు జన్మదిన వేడుకలు శుక్రవారం స్థానిక నాయుకులు,సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు సాలువతో సత్కరించి కేక్ కటింగ్ చేసి సోమేష్ కు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

ఈ సందర్భంగా సోమేశ్వరరావు తన ప్రియతమ నాయకులు చింతకాయల సుజాత ముత్యాలు సమక్షంలో పుట్టినరోజు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు అర్జిల్లి దేవిరవి, మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, 1 వార్డు మెంబర్ ఒలిశెట్టి పోలమ్మ,, ఒలిశెట్టి అప్పలరాజు, కణితి చినసోమేశ్వరరావు సమ్మంగి అప్పలరాజు, సమ్మంగి ముత్యాలు,అర్జిల్లి అప్పలరాజు, సొసైటీ ప్రెసిడెంట్ కొవిరి పెద్ద ముత్యాలు స్కూల్ కమిటీ చైర్మన్ నరేంద్ర, రాయుడు, చింతకాయలు బంగారు రాజు , చింతకాయల మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# పలువురి దాతల కోసం ఎదురుచూపులు

- ఆదివాసి క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందించరూ..
- ప్రతిభావంతుడికి అడ్డుగా ఆర్థిక భారం
- మన్యం నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో మెరిసిన ఆదివాసీ ఆణిముత్యం

**జయభేరి, వాజేడు, ఆగస్టు 16 :**

వాజేడు వెంకటాపురం మారుమూల ఏజెన్సీలో పుట్టి అత్యంత ప్రతిభను కనపరిచి అంతర్జాతీయ స్థాయి క్రీడల పోటీకి ఎంపికయ్యాడు. వివరాల్లోకి వెళితే ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన మోడెం వంశీ కడు పేదరికంలో జన్మించాడు. చిన్నప్పటి నుంచే ఎంతో పేదరికాన్ని చవి చూశాడు.అతను ఒక జిమ్ సెంటర్లో పగలు (గేటు కీపర్) వాచ్ మెన్ గా విధులు నిర్వహిస్తూ రాత్రి సమయాలలో అదే జిమ్ లో కఠిన సాధనాలు చేస్తూ రాష్ట్రస్థాయి,దేశ స్థాయి, అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పథకాలను సాధించాడు.



ఇది ఇలా ఉండగా ఈనెల 22వ తేదీన మన భారతదేశ నుంచి కోస్టారికా దేశంలో జరిగే అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు.

కానీ ఆ పోటీలో పాల్గొనడానికి నాలుగు లక్షల 50 వేలు రూపాయలు అవసరం ఉన్నది. కానీ కనీస ఖర్చులు లేక ఆర్థిక సాయం కోసం పలువురు దాతల ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. సహృదయం కలిగిన దాతలు ఎవరైనా 8074581584 ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోగలరని పత్రికాముఖంగా కోరుచున్నాడు.

# స్కూల్ సార్లని బదిలీ చేస్తే..

## స్కూల్ కి తాళం వేస్తాం.. ఉద్యమం చేపడతాం...

**జయభేరి, చర్ల, ఆగస్టు 16 :**

తిప్పాపురం గ్రామ పంచాయతీ పరిధిలో నీ గల బట్టిగూడెం ఎం పి పి ఎస్ స్కూల్ లో పని చేస్తున్న టీచర్స్ నీ డిప్యూటేసన్ కింద వేరే స్కూల్ లో పంపించడానికి చూస్తున్నారు అని అలా జరుగుతే స్కూల్ కి తాళాలేస్తామని ఉద్యమాన్ని చేపడతామని మాజీ సర్పంచ్ కారం కన్నారావు, అన్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసి గ్రామంలో ఇంతకు ముందు ఏ టీచర్ లేక విద్యార్థులకు సరైన విద్యా అందలేక పోయింది. ఈ స్కూల్ లో విధులు నిర్వహిస్తున్నా టీచర్స్ వలన ఈ ఆదివాసి బిడ్డలకు ఇప్పుడిపుడే విద్యా ఫలాలు అందుతున్నాయి. ఈ సమయంలో టీచర్స్ డిప్యుటేషన్ పేరు తో వేరే స్కూల్ కి పంపడం వలన ఈ ఆదివాసి పిల్లలు పరిస్థితి ఏమిటి ఈ స్కూల్ లో 25 మంది పిల్లలు ఉండే ఇద్దరు టీచర్స్ నిబంధన ఉన్న ఈ నిబంధనకు విరుద్ధంగా డిప్యుటేషన్ పంపించడం గ్రామస్థులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ డిప్యుటేషన్ విరమించకుంటే స్కూల్ కి తాళం వేసి ఉద్యమం చేపడతాం,ఖబడ్దార్ కారం కన్నారావు మాజీ సర్పంచ్, మీడియం స్వామి, కారం రామ రావు, మీడియం లక్ష్మయ్య, గట్టు పల్లి ఎర్రయ్య, పర్సిక బాబు రావు, తదితరులు పాల్గొన్నారు.



# ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు

**జయభేరి, హైదరాబాద్:**

ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు అయ్యారు. మరో ఐదుగురు పరారీలో వున్నారని మాదాపూర్ డీసీపీ వినీత్ వెల్లడించారు. నిందుతుల నుండి పది కేజీల గోల్డ్ కోటెడ్ వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ ఎస్వోటీ , క్రైమ్స్, లా అండ్ ఆర్డర్ టీం లు కలిసి 24 గంటల్లో ఛేదించారు. ఈ గ్యాంగ్ లో మొత్తం ఏడుగురు ఉన్నారు... బీహార్ కు చెందిన ముఠా. ఆరుగురు ఖజానా కు వచ్చారు..డిప్యూటీ మేనేజర్ పై కాల్పులు జరిపారు. ఆశిష్, దీపక్ ఇద్దరినీ అరెస్ట్ చేశాం. ఈ గ్యాంగ్ లోని ఒక్కొక్కరి మీద మూడు, నాలుగు కేసులు ఉన్నాయి. ఏ 1 గ్యాంగ్ లీడర్ పైన రెండు మర్డర్ కేసులు, డెకాయిట్ కేసులు ఉన్నాయి. జగద్గిరిగుట్ట లో ఉంటున్న ఆశిష్ ఇంటికి బీహార్ గ్యాంగ్ వచ్చి రెక్కీ నిర్వహించిందని అన్నారు. 12 రోజులుగా రెక్కీ చేశారు. రెండు బైక్ లా మీద ఆరుగురు వచ్చారు.. అఫెన్స్ టైం లో బైక్ ల నెంబర్ ప్లేట్లు మార్చారు.. దీపక్ అందరికి ఆ అకామిడిషన్, బైక్ లు ఏర్పాటు చేశాడు. 12 రోజులు రెక్కి చేసినప్పుడు ఖజానా లో గోల్డ్ ఎక్కువగా ఉంది. సెక్యూరిటీ లేదు, పారిపోవడానికి ఈజీగా ఉందని ఖజానాను సెలెక్ట్ చేసుకున్నారని అన్నారు. బీహార్ గ్యాంగ్ మన స్టేట్ లో చేయడం ఇదే ఫస్ట్. బెంగాల్, బీహార్ లలో 4 కోట్ల రాబరీ కూడా చేశారని అన్నారు.




# స్నేహం పేరుతో నమ్మించి ఓ యువతిపై పది మంది సామూహిక అత్యాచారం

**జయభేరి, జనగాం ఆగస్టు 16:**

స్నేహం పేరుతో నమ్మించి ఓ యువతిపై పది మంది సామూహిక అత్యాచారం చేశారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన జనగామ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జనగామ జిల్లాకు చెంది మోహమ్మద్ ఒవైసి, ముత్యాల పవన్ కుమార్, బౌద్ధుల శివ కుమార్, నూకల రవి, జెట్టి సంజయ్, ఎమ్.డి. అబ్దుల్ ఖయూం, పుస్తకాల సాయి తేజ, ముట్టాడి సుమంత్ రెడ్డి, గుండ సాయి చరణ్ రెడ్డి, ఒరుగంటి సాయి రామ్ అనే యువకులు ఓ యువతితో పరిచయం పెంచుకున్నారు. స్నేహం పేరుతో యువతిని జనగాసూర్యాపేట రోడ్డులోని టీ వరల్డ్ లో ఓ రూమ్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఆ యువతిపై పది మంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితులలో ఒకడు యువతిని గోవాకు తీసుకెళ్లి ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. ఈ విషయం బాధితురాలి అత్తకు తెలియడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి పది మంది నిందితులను సిద్దిపేట రోడ్డులో పట్టుకున్నారు. సిఐ దామోదర్ రెడ్డి, ఎస్ఐ భరత్ వారిని తనదైన శైలిలో ప్రశ్నించడంతో నిజాలు ఒప్పుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# పరవళ్ళు తొక్కుతున్న బొగత జలపాతం

- జలపాతం వద్ద పర్యాటకుల సందడి..



**జయభేరి, ములుగు:**

ఎగువ కురుస్తున్న వర్షాలతో పాటు నిన్నటి నుండి కురుస్తున్న వర్షాలకు ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి గ్రామంలోని తెలంగాణ నయాగరహగా పేరుగాంచిన బొగత జలపాతం పరవళ్ళు తొక్కుతుంది.జలపాతం వద్ద భారీగా వరద నీరు చేరడంతో బొగత జలపాతం పరవళ్ళు తొక్కుతూ అందాలు ఆరబోసినట్లు పర్యాటకులను మైమరింపజేస్తుంది.పర్యాటకులు బొగత అందాలను వీక్షిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రం నుంచి కాకుండా ఛత్తీస్ ఘడ్,మహారాష్ట్ర నుండి పర్యాటకులు వచ్చి జలపాతాన్ని చూసి వెళుతున్నారు.సెలవు దినాలు కావడం తో కుటుంబసభ్యులతో కలసి జలపాత అందాలను చూస్తూ సెల్ఫీలు దిగుతూ కేరింతలు కొడుతున్నారు.జలపాతం వద్ద భారీగా వరద చేరడంతో బొగత జలపాతం వద్ద ఉన్న కొలనులోకి అటవీ శాఖ అధికారులు పోలీసులు అనుమతిని ఇవ్వడం లేదు.



# విద్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలు

**జయభేరి, చర్ల, ఆగస్టు 16 :**

చర్ల మండలం తేగడ గ్రామంలోని సరస్వతి విద్యానికేతన్ లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కృష్ణాష్టమి కి కృష్ణుడు గోపికల వేషాలు ధరించి కోలాటాలాడి, కృష్ణుడి చిలిపి చేష్టల వృత్తాంతాలను పునః ప్రదర్శించి అందరినీ అలరించారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలో యాజమాన్యం ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టి పిల్లలు ఒకరితో ఒకరు పోటీపడి మరి ఆనందపడ్డారు. ఉట్టి కొట్టి బహుమతి గెలిచిన తర్వాత వారి ఆనందాన్ని వివరించడం అసాధ్యమని, కృష్ణుని మనసారా తలుచుకుంటూ విద్యార్థుల సంతోషకర జ్ఞాపకాలను పెంచడం కోసం ఈ ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించినట్టు స్కూల్ యాజమాన్యం పేర్కొంది.

# పీహెచ్డీ పట్టా అందుకున్న సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం కొమ్మపల్లి గ్రామానికి చెందిన సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కు Throne of grace Theological university International, Affiliated India, Telangana హైదరాబాద్ వారు సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ లో ఏర్పాటు చేసినటువంటి స్నాతకోత్సవంలో వీరు చేసినటువంటి పరిశోధనలకు ఎనాలిసిస్ అఫ్ socio రిలీజియస్ ఇంపాక్టు అంశంపై పరిశోధన చేసినందుకు గాను దేశంలో ఉన్నటువంటి వివిధ మతాలు సమాజంపై ఎలాంటి ప్రభావాన్ని చూపు తున్నయి వాటి ప్రభావం జీవనశైలి సామాజిక, ఆర్థిక అంశాలపై పరిశోధన చేసచేసినందు కూ గాను యూనివర్సిటీ వైస్ ఛాన్స్లర్ డాక్టర్ చింత జాన్ డేవిడ్ గారు ఇతనికి వారి చేతుల మీదుగా పిహెచ్డి పట్టాను అందించారు రిజిస్టర్ నెల్సన్ తదితరులు పాల్గొన్నారు.


# శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయానికి విరాళం



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలంలోని అచ్చంపేట పట్టి గ్రామంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కొరకు నాయకులు జాలే నరసింహారెడ్డి పీసీసీ సభ్యులు PACS చైర్మన్ ని విరాళం అడగగా వెంటనే మంచి మనసుతో స్పందించిన నరసింహారెడ్డి ఆలయ అభివృద్ధి కొరకు రూ. 25, 000 అక్షరాల ఇరవై ఐదు వేల రూపాయలు విరాళం అందించడం జరిగింది. అనంతరం గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. గతంలో మా గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి ఆలయానికి హైమాస్ లైట్లు ఏర్పాటు చేసి నేడు ఆలయ అభివృద్ధి కొరకు ఇరవై ఐదు వేల రూపాయలు విరాళం అందించిన నరసింహారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఆ ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు వారిపై వారి కుటుంబ సభ్యులపైనా ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు లక్ పతి నాయక్, గోప్య నాయక్, తులసీరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం మర్రిచెట్టుతండా లో ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేసిన ఎంపీడీఓ డ్యానీయల్ ఈ కార్యక్రమంలో మైనంపల్లి మాజీ ఎంపీటీసీ యూవజన కాంగ్రెస్ రాష్ట్ర నేత కొర్ర రాంసింగ్ నాయక్,సీత్య నాయక్,మాజీ సర్పంచి శ్రీను నాయక్,ఉప సర్పంచ్ చిన్న నాయక్ పంచాయతీ కార్యదర్శి కీర్తి,కిషన్, కాంగ్రెస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# నక్కలపల్లిలో నిర్వాసిత రైతుల ధర్నా

**జయభేరి, వరంగల్:**

మామ్నూర్ ఎయిర్ పోర్ట్ భూములు కోల్పోతున్న రైతులు నక్కలపెల్లి రోడ్డు పై ధర్నాకు దిగారు. రోడ్డుకు అనుకొని వున్న విలువైన భూమలకి తక్కువ పరిహారం ఇస్తున్నారు అని రైతుల ఆవేదన. బహిరంగ మార్కెట్ లో ప్రస్తుతం ఒక్క ఎకరానికి 3 నుండి 4 కోట్లు డిమాండ్ వున్న భూములని కోల్పోతున్నాం అని వారి వాదన. మేము అభివృద్ధి కి అడ్డు కాదు.. సరైన పరిహారం ఇవ్వలని డిమాండ్ చేసారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులను మోహరించారు.

# ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు

**జయభేరి, ఖమ్మం, ఆగస్టు 16:**



తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కోసం అధికారులు ఎంత కఠిన చర్యలు తీసుకుంటున్నా.. అక్కడక్కడ అవకతవకలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. తాజాగా ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికి ఐదు ఇళ్లు మంజూరు కావడం వివాదాస్పదమైంది. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా అనర్హులకు ఇళ్లు మంజూరు కావడంతో 1950 ఇళ్లను అధికారులు రద్దు చేసిన సంగతి తెలిసిందే.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలి విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఈ ఇళ్లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. వీలైనంత వరకు పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి.. ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో అధికారులు చాలా అప్రమత్తంగా ఉంటున్నారు. 360 డిగ్రీలో అభ్యర్థుల వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే.. అర్హులుగా తేలిన వారిని ఎంపిక చేసి వారికి ఇళ్లు కేటాయిస్తున్నారు. అయితే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని చోట్ల అనర్హులకు ఇళ్లు మంజూరవుతున్నాయి. తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఓ వార్త సంచలనంగా మారింది. ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారనే వార్తపై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అవుతోంది. ఆ వివరాలు..ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారనే వార్త సంచలనంగా మారింది.

ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ తొలి విడతలో ఇళ్లు మంజూరైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా లాభం లేదని.. అధికారులు దీనిపై స్పందిచడం లేదని.. తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎవరైనా దీనిపై స్పందించి విచారణ చేపట్టాలని.. నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉంటే కొన్ని రోజుల క్రితం హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు 1950 మందికి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1,950 మంది అనర్హులకు ఇళ్లు మంజూరు చేసినట్లు గుర్తించారు. దీంతో అధికారుల వారి ఇళ్లను రద్దు చేశారు.

మరోవైపు శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు అధికారులు. వీరందరికి గతంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని.. అప్పుడు నిర్మాణం చేపట్టలేదని అధికారులు తెలిపారు.తొలి విడత రూ.లక్ష చెల్లించే సమయంలో వీరి గురించి తెలిసిందని.. అందుకే వెంటనే వీరికి కేటాయించిన ఇళ్లను రద్దు చేసి వారి స్థానంలో అర్హులైన కొత్త వారికి అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. మరి ఇప్పుడు ఒకే కుటుంబంలోమ 5గురు ఇందిరమ్మ ఇళ్లను పొందారన్న దానిపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి అంటున్నారు.




## మొక్కల జన్మదిన వేడుకలు

■ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో వినూత్న కార్యక్రమం

**జయభేరి, మేడ్చల్ :**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ ఆద్వర్యంలో ఒక ఉపాధ్యాయుడు ఒక వృక్షం కార్యక్రమం చేపట్టగా అందులో భాగంగా గతేడాది హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలకు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థులను యువ మేధావులుగా తీర్చిదిద్దడమే కాకుండా పర్యావరణ రక్షకులుగా మారాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాసాలమర్రిలో ఈనెల 21న పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 16 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో ఈనెల 21న పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విగ్రహ దాత కోల సుగుణమ్మ ఆంజనేయులు తెలిపారు..ఈనెల 21న ఉదయం స్థాపిత దేవత హవనం ,మూల మంత్ర జపం ,కుంబాభిషేకం ,గర్త సంస్కారం అనంతరం శ్రీ పాండురంగ ఆశ్రమ వేద పండితులచే యంత్ర ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు .అనంతరం దృక్పలి, పూర్ణాహుతి, బృత్విక్ సన్మానం, బ్రాహ్మణ ఆశీర్వచనం ,అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25 అడుగుల పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హనుమాన్ దీక్ష పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ హాజరవుతున్నారని తెలిపారు.ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.




## ఈ కామర్స్ అక్రమాలపై కన్ను

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 16:**

హాల్ మార్క్ మోసాలు, సర్టిఫైడ్ కానీ అసురక్షిత ఉత్పత్తులపై బీఐఎస్ అధికారులు మెరుపు దాడులు చేపట్టడంతో అక్రమార్కులు హడలిపోతున్నారు. ప్రముఖ ఈ కామర్స్ లాంటి ఫ్లికార్ట్, అమెజాన్, మీషోలో జరుగుతున్న చీటింగ్‌లపై అధికారులు మెరుపు దాడులు చేస్తున్నారు. ఈ దాడులలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. విజయవాడ బంగారం షాపులలో తనిఖీలు సందర్భంగా పలు మోసాలను గుర్తించారు అధికారులు. ప్రభుత్వం నుంచి బులియన్ అండ్ హోల్ సేల్ పేరుతో అనుమతి తీసుకొని మార్కెట్లో గోల్డ్ అండ్ డైమండ్ పేరుతో వ్యాపారాలను నిర్వహిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో బట్టబయలైంది. కొన్ని షాపులలో బంగారు ఆభరణాలపై డమ్మీ నెంబర్లు, ఇతర ఐడి నెంబర్లతో ఉన్న హాల్ మార్క్‌ను గుర్తించారు. నాణ్యత గల బంగారు ఆభరణాలకు కేంద్ర ప్రభుత్వం హెచ్‌యూ ఐడీ నెంబర్ జారీ చేసి షాపు పేరుతో హాల్ మార్క్ ఇస్తుంది. వీటిని జువెలరీ షాపుల యజమానులు తాము విక్రయించే ఆభరణాలపై ముద్రించాల్సి ఉంటుంది. కానీ కొన్ని షాపులలో ఎటువంటి హాల్ మార్క్ లేకుండా ఉన్న ఆభరణాలను గుర్తించారు అధికారులు. దాంతో వాటిని సీజ్ చేశారు. నరసన్నపేటలోని మారుతి నగర్ జంక్షన్ వద్ద బీఎస్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్ జువెలరీ షాప్‌లో బిఐఎస్ సంస్థ ఇటీవల తనిఖీలు నిర్వహించింది. షాపులలో హాల్ మార్క్ లేకుండా 1072, 450 గ్రాముల బంగారు ఆభరణాలు విక్రయించడానికి సిద్ధంగా ఉంచినట్లు అధికారులు కేసు నమోదు చేశారు.. మరోవైపు ఈ కామర్స్ అక్రమాలపై డేగ కన్నువేశారు బీఐఎస్ అధికారులు. ఫ్లిప్‌కార్ట్, ఈ కార్ట్, మీ షోలో చోటు చేసుకున్న అక్రమాలపై దృష్టి సారించారు. ఇటీవలే కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాదులోని షోరూమ్ లపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఎలక్ట్రానిక్స్, ఎల్ఈడీ బల్బులు, బొమ్మలు, టేబుల్ ఫ్యాన్లతో సహా పెద్ద మొత్తంలో వస్తువులను బీఎస్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వస్తువులకు బీఐఎస్ సర్టిఫికేషన్ గుర్తు లేకపోవడంతో బీఐఎస్ చట్టం, 2016 యొక్క సెక్షన్ 17ని ఉల్లంఘించినట్లు సంబంధిత వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేశారు...ప్రతి వస్తువులో నాణ్యతపై ప్రజలు ప్రత్యేక దృష్టిసారిస్తున్న క్రమంలో బీఐఎస్ సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యత పెరిగింది. బీఐఎస్ సర్టిఫికెట్ ఉన్నట్లైతే ఉత్పత్తి నాణ్యతగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న ఎమ్ఎస్ఎమ్ఈలు గ్లోబల్‌గా ఎదగాలంటే బీఐఎస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. భారత ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) సర్టిఫికెట్ ఉన్న ఉత్పత్తుల మార్కెటింగ్ ఈజీ అవుతోంది. ఇండియాలో స్టాండర్డ్స్ చేయాలంటే అది బీఐఎస్ మాత్రమే చేయాలి. ప్రొడక్ట్ తయారీ, నిల్వ, అమ్మకాలు చేయాలన్నా బీఐఎస్ సర్టిఫికేషన్ ఉండాలి. ఈ క్రమంలో ఇండియాలో 816 వస్తువులకు బీఐఎస్ సర్టిఫికేషన్ పొందేలా కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది.ఇతర దేశాలకు చెందిన వస్తువులు ఇండియాలో అమ్మాలన్నా ఈ సర్టిఫికేషన్ అవసరం ఉంటుంది. ఈక్రమంలో బీఐఎస్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఆన్‌లైన్ నాణ్యత నియంత్రణలో ఆ వస్తువు వివరాలు రెండుసార్లు కంటే ఎక్కువ కనిపించకపోతే.. ఎవరైనా బీఐఎస్ మార్క్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు అని విజయవాడ బీఐఎస్ డైరెక్టర్ ప్రేమ్ సంజని తెలిపారు.

# ములుగు జిల్లాకు ఐటీ కంపెనీ

**జయభేరి, వరంగల్, ఆగస్టు 16:**




ములుగును ఐటీ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. రూ.6 కోట్లతో ఐదు అంతస్తుల అత్యాధునిక ఐటీ భవనాన్ని నిర్మించనున్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా టాస్క్ సెంటర్‌లో ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని కార్యకలాపాలు ప్రారంభించారు. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఐటీ విప్లవం సృష్టించి వేల సంఖ్యలో ఉద్యోగాలను కల్పించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. తెలంగాణలోని వెనుకబడిన మన్యం జిల్లా ములుగును భవిష్యత్తులో ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. స్థానిక యువతకు ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.

జిల్లాలో పెద్ద ఐటీ కంపెనీలను ఆకర్షించేలా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ములుగు పట్టణ శివారులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.6 కోట్లతో అత్యాధునిక ఐటీ భవనం నిర్మించనున్నారు. ఈ ఐదు అంతస్తుల భవనం కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో అంతస్తులో ఒక్కో ఐటీ కంపెనీని ఏర్పాటు చేసి, వేల సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఉన్న తరహాలోనే ఈ భవనంలో అన్ని రకాల వసతులు కల్పించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల మంజూరు కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ములుగులో ఇప్పటికే ఏర్పాటు చేసిన టాస్క్ ) సెంటర్‌లో యువతకు ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.

ఐటీ కంపెనీల ప్రాజెక్టులకు అనుగుణంగా ఉండే కోర్సులపై దృష్టి సారించి యువతను సిద్ధం చేస్తున్నారు. శిక్షణ పూర్తి అయిన వెంటనే ఇక్కడే ఉద్యోగాలు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఐటీ కంపెనీలను ఆకర్షించే దిశగా తొలి అడుగు పడింది. ములుగులోని టాస్క్ సెంటర్ ఆవరణలో సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం చేసుకుని నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో ఉద్యోగులు, మేనేజర్ల గదులు, వెయిటింగ్ హాల్ వంటి సౌకర్యాలు కార్పొరేట్ స్థాయిలో కల్పించారు. త్వరలోనే మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈ కంపెనీ సేవలు మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏజెన్సీ ప్రాంతమైన ములుగులో ఐటీ విప్లవం సృష్టించి చరిత్ర సృష్టించాలని ములుగు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది.

## ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ బాక్స్, డ్రమ్స్ బహుకరణ



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 16 :**

తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని విద్యార్థులకు గ్రామానికి చెందిన పూజారి మల్లేష్ యాదవ్, బాలు యాదవ్ లు సౌండ్ బాక్స్లు, డ్రమ్స్ లను బహూకరించారు. ఈ సందర్భంగా బాలు యాదవ్ మాట్లాడుతూ స్కూల్లో మౌలిక సదుపాయాల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, విద్యార్థులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మెత్తబడుతున్న కవిత

**జయభేరి, హైదరాబాద్, ఆగస్ట్ 16:**



కొద్దిరోజులుగా భారత రాష్ట్ర సమితి శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత సొంత పార్టీలో కొంతమంది నాయకులపై యుద్ధం ప్రకటించారు. ఆ యుద్ధాన్ని అలాగే కొనసాగిస్తున్నారు. తన తండ్రిని దేవుడు అంటూనే.. తనను ఇబ్బంది పెడుతున్న నాయకులను దయ్యాలు అని కల్వకుంట్ల కవిత ఆరోపిస్తున్నారు. సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ తనదైన శైలిలో విమర్శలు చేస్తున్నారు. వాస్తవానికి కల్వకుంట్ల కవిత స్థానంలో మరొక నాయకుడు ఉంటే కేసీఆర్ ఇప్పటికే తన పార్టీ నుంచి బయటికి పంపించేవారు. కల్వకుంట్ల కవిత ఆయన కుమార్తె కాబట్టి నిశ్శబ్దంగా ఉంటున్నారు.కల్వకుంట్ల కవిత కూడా భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూనే.. తన మానస పుత్రిక జాగృతిని బలోపేతం చేస్తున్నారు. జాగృతి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. గత పది సంవత్సరాలుగా జాగృతి విషయంలో అంతగా సీరియస్ నెస్ చూపించని కవిత.. కొద్దిరోజులుగా జాగృతిని బలోపేతం చేస్తున్నారు. జిల్లాలకు కమిటీలు ఏర్పాటు చేశారు. సింగరేణి కార్మిక సంఘం నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఒక రకంగా తెలంగాణ అప్పటి పరిస్థితులను ఆమె చూపిస్తున్నారు.భారత రాష్ట్ర సమితిలో తన తండ్రిని దేవుడు అని వ్యాఖ్యానించిన ఆమె.. కొంతమంది నాయకులను దయ్యాలు అని ఆరోపిస్తున్నారు. అంతేకాదు ఒక నాయకుడిని ఉద్దేశించి ఇటీవల లిల్లీపుట్ అని కూడా ఆరోపించారు. అయితే అటువంటి కవిత ఇప్పుడు సొంత పార్టీ లోకి వెళ్తున్నారా.. త్వరలో దానికి ముహూర్తం ఖరారయిందా.. ఈ ప్రశ్నలకు అవును అనే సమాధానం చెబుతున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతి జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఒక సర్క్యులర్ విడుదల చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కలవకుండా కవిత తన సామాజిక మాధ్యమ వేదికలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ తెలంగాణ తల్లి విగ్రహాలను ఆమోదించేది లేదని పేర్కొన్నారు. అదే కాదు ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ తల్లి విగ్రహాలు ఎక్కువ రోజులు నిలబడవని కవిత స్పష్టం చేశారు. వచ్చే రోజుల్లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ విగ్రహాలను సకల మర్యాదలతో గాంధీభవన్ కు పంపిస్తామని కవిత ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. ఎందుకంటే భారత రాష్ట్ర సమితి తిరిగే అధికారంలోకి వస్తే అనే పదాన్ని వాడారు కాబట్టి కవిత.. తిరిగి సొంత పార్టీలోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కెసిఆర్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడం వల్లే కవిత ఆ వ్యాఖ్యలు చేశారని సమాచారం. ఇటీవల రాఖీ పండుగ సందర్భంగా కేటీఆర్ కు కవిత రాఖీ కట్టని విషయం తెలిసిందే. పైగా కేటీఆర్ భారత రాష్ట్ర సమితికి కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఉన్నారు. అలాంటప్పుడు ఆయన కవిత రాకకు ఒప్పుకున్నారా.. అందువల్లే ఆమె ఇలాంటి ట్వీట్ చేశారా.. అనే ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలు ఊరూరా ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ తల్లిని ప్రజలపై రుద్దే కుట్రకు ఈ అరాచక ప్రభుత్వం తెరలేపింది.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 16 :**

తుర్కపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ భూక్య సుశీల రవీందర్ నాయక్, మండల సెక్రెటరీ జనరల్ సాగర్ల పరమేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ పలుకుల నవీన్ కుమార్, మాజీ సర్పంచులు పోగుల ఆంజనేయులు, ఇమ్మడి మల్లప్ప, సురేష్, హరి నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రహమత్ షరీఫ్, నాయకులు జాలిగాం కృష్ణ, భాస్కర్ నాయక్, యాకోబ్, సీతరాజు ,చంద్రమౌళి ,వెంకటేష్, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# ఓవర్సీస్‌లో కూలీ దిమ్మతిరిగే కలెక్షన్స్.. రజినీ క్రేజ్ దెబ్బకు రికార్డ్ బద్దలంతే..

దేశీయ మార్కెట్‌లోనూ 'కూలీ' భారీ వసూళ్లను నమోదు చేసింది. భారత్‌లో తొలిరోజు రూ.65 కోట్ల నికర వసూళ్లతో, విజయ్ నటించిన 'లియో' తర్వాత రెండో అతిపెద్ద తమిళ ఓపెనర్‌గా నిలిచింది. దేశవ్యాప్తంగా గ్రాస్ వసూళ్లు సుమారు రూ.80 కోట్లుగా ఉన్నాయి. ఇక విదేశాల్లో అయితే 'కూలీ' హవా మామూలుగా లేదు. ఉత్తర అమెరికాలో 3.04 మిలియన్ డాలర్లు, యూకేలో 124 వేల పౌండ్లు, ఆస్ట్రేలియాలో 5.35 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్ల వసూళ్లతో తమిళ చిత్రాల్లో సరికొత్త ఆల్ టైమ్ రికార్డులను సృష్టించింది. ఈ అసాధారణ వసూళ్లతో 'కూలీ' చిత్రం, 'జవాన్', 'యానిమల్' , 'పఠాన్' వంటి బాలీవుడ్ భారీ చిత్రాల తొలిరోజు వసూళ్లను అధిగమించింది. భారతీయ సినిమాల్లో టాప్10 అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రాల జాబితాలో సగర్వంగా స్థానం సంపాదించింది. రజనీకాంత్‌తో పాటు నాగార్జున, శ్రుతి హాసన్, ఉపేంద్ర, అమీర్ ఖాన్ వంటి భారీ తారాగణం నటించడం, స్వాతంత్ర్య దినోత్సవం సెలవు కలిసిరావడంతో సినిమాకు భారీ ఆదరణ లభిస్తోంది. ఇదే జోరు కొనసాగితే, వారాంతం నాటికి ఈ చిత్రం రూ.300 కోట్ల మార్కును సునాయాసంగా దాటుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# హీరోగా తేజ తనయుడు? హీరోయిన్‌గా స్టార్ కిడ్?



కొత్తవాళ్లను పరిచయం చేయడంలో దిట్ట దర్శకుడు తేజ. చిత్రం, నువ్వునేను, జయం చిత్రాలే అందుకు ఉదాహరణ. ఆయన ద్వారా పరిచయమైన ఎందరో నటీనటులు స్టార్లుగా కొనసాగిన విషయం తెలిసిందే. త్వరలో తన కుమారుడు అంకితోవ్ తేజ్‌ని హీరోగా పరిచయం చేయనున్నారట తేజ. ప్రస్తుతం అంకితోవ్ యాక్టింగ్ కోర్స్ చేస్తున్నట్టు తెలుస్తున్నది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. సూపర్‌స్టార్ కృష్ణ మనవరాలు, ఘట్టమనేని రమేష్‌బాబు కుమార్తె అయిన భారతిని ఈ సినిమా ద్వారా కథానాయికగా పరిచయం చేయనున్నారట తేజ. ఓ అందమైన ప్రేమకథతో ఈ సినిమా రూపొందనున్నదని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెలుగు చూడనున్నాయి.

# మరింత వికసిస్తున్నాను..



జాన్వీ కపూర్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ బ్యూటీ సొంతం. ఈ అమ్మడు జూనియర్ ఎన్టీఆర్ సరసన దేవర మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు, అందానికి ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దేవర మూవీలో తన నటనతో మంచి ఫేమ్ సంపాదించుకుంది ఈ చిన్నది. దీంతో ఈ అమ్మడుకి ఇటు తెలుగులో అటు బాలీవుడ్ నుంచి ఎక్కువగా ఆఫర్స్ రావడంతో ఈ బ్యూటీ వరస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది. ప్రస్తుతం తెలుగులో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన పెద్ది సినిమాలో నటిస్తుంది ఈ బ్యూటీ. మరో వైపు జాన్వీ కపూర్ నటుడు సిద్ధార్థ్ మల్హోత్ర సరసన పరం సుందరి మూవీలో నటించిన విషయం తెలిసిందే. ఈ మూవీ త్వరలో రిలీజ్ కానుండటంతో జాన్వీ ఈ మూవీ ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉంది. హీరోతో కలిసి పరం సందరి ప్రమోషన్స్‌లో చురుకుగా పాల్గొంటుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ తన హాట్ అండ్ క్యూట్ ఫొటోస్ షేర్ చేస్తూ కుర్రకారును తెగ ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ పింక్ కలర్ చీరలో అందంగా రెడీ పలు ఫొటోలకు ఫోజులిచ్చింది. అందులో జాన్వీని చూస్తే మతిపోవాల్సిందే. పింక్ కలర్ చీరలో.. సింపుల్ లుక్‌లో చాలా బ్యూటిఫుల్‌గా ఉంది ఈ బ్యూటీ. ఇక ఈ ఫొటోలను తన ఇన్ స్టాలో షేర్ చేస్తూ.. ఈ సుందరి మీ ప్రేమను చూస్తూ మరిం వికసిస్తుంది అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ సోషల్ మీడియలో తెగ వైరల్ అవుతున్నాయి.

# ఉల్లిపొరలాంటి చీరలో చూస్తే..



బ్యూటీ అనన్యనాగళ్ల గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈ చిన్నది మల్లేశం సినిమాతో టాలీవుడ్‌కు పరిచయం అయ్యింది. ఈ మూవీతో తెలుగు ప్రజలను బాగా ఆకట్టుకవడంతో అనన్యకు కూడా మంచి గుర్తింపు లభించింది. దీంతో ఈ మూవీ తర్వాత ఈ బ్యూటీ ఏకంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ వకీల్ సాబ్ సినిమాలో కీలక పాత్రలో ఛాన్స్ కొట్టేసింది. ఈ మూవీలో ఈ బ్యూటీ తన నటనతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. సింపుల్‌గా కనిపిస్తూ, తన నటనతో అందరినీ తన వైపుకు లాక్కుంది ఈ చిన్నది. దీంతో ఈ మూవీ తర్వాత అనన్యకు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది. ఈ మూవీ తర్వాత ఈ బ్యూటీకి వరసగా ఆఫర్స్ రావడంతో పలు సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే అనన్య, ఎప్పటికప్పుడు తన ఫొటోస్ షేర్ చేస్తూ కుర్రకారును మాయ చేస్తుంటుంది. ఈ క్రమంలోనే ఈ చిన్నది తెల్ల చీరలో సింపుల్‌గా రెడీ అయిన బ్యూటిఫుల్ ఫొటోస్ షేర్ చేసింది. అందులో ఈ అమ్మడు అందం చూస్తే ప్రతి ఒక్కరూ ఫిదా అవ్వాల్సిందే. అంత క్యూట్‌గా ఉన్నాయి ఫొటోస్. ఉల్లిపొరలాటి నెట్టెడ్ చీరలో తన ఘాటనై అందాలతో కుర్రకారుకు మతిపోగొడుతుంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మరి మీరు కూడా ఈ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.

# నితిన్ తన కొడుక్కి భలే వెరైటీ పేరు పెట్టాడుగా.. నెటిజన్స్ క్రేజీ కామెంట్స్



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్, భార్య షాలినీ దంపతులకు గతేడాది కుమారుడు జన్మించిన సంగతి తెలిసిందే. 2024 సెప్టెంబర్ 6న ఈ జంటకు పండంటి మగబిడ్డ పుట్టాడు. అయితే అప్పటి నుంచి చిన్నారి ఫోటో గానీ, వీడియో గానీ సోషల్ మీడియాలో విడుదల చేయలేదు. అయితే కృష్ణాష్టమి సందర్భంగా శుభవార్తను అభిమానులతో పంచుకున్నారు నితిన్. కృష్ణాష్టమి రోజున తన బాబు పేరును ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించారు నితిన్. తన కొడుకుకు 'అవ్యుక్త్' అనే పేరు పెట్టినట్లు వెల్లడించారు. "ఈ జన్మాష్టమికి మా హృదయాలు సంతోషంతో నిండిపోయాయి. మా కొడుకు పేరు అవ్యుక్త్ అని సంతోషంగా ప్రకటిస్తున్నాం. మా జీవితాల్లో ఎప్పటికీ ఓ చిన్న కృష్ణుడిగా ఉండిపోతాడు" అంటూ ఎమోషనల్ పోస్ట్ చేశారు నితిన్. ఈ పేరు విన్న తర్వాత నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. పేరు భలే వెరైటీగా ఉందని అంటున్నారు. 'అవ్యుక్త్' అనే పేరుకు శాశ్వతమైనదీ, స్వచ్ఛతను సూచించేదీ అనే అర్థాలు ఉన్నాయి. హిందూ తత్వంలో ఈ పదాన్ని పరమాత్మ లేదా ప్రకృతి మూలం అనే అర్థంలో వాడతారు. న్యూమరాలజీ ప్రకారం, ఈ పేరున్నవారు ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న తపన, ధైర్యం, నాయకత్వ లక్షణాలు వారిలో కనిపిస్తాయి. నితిన్‌షాలినీ 2020లో ప్రేమ వివాహం చేసుకున్నారు. గతేడాది తల్లిదండ్రులుగా మారారు. దాదాపు 11 నెలల తర్వాత కుమారుడికి పేరు పెట్టారు. ఇక సినిమాల విషయానికి వస్తే, నితిన్ నటించిన 'తమ్ముడు' చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశను మిగిల్చింది. అంతకు ముందు 'రాబిన్ హుడ్' కూడా ఫెయిల్ అయ్యింది. ప్రస్తుతం 'బలగం' ఫేమ్ వేణు దర్శకత్వంలో 'ఎల్లమ్మ' అనే సినిమా చేస్తున్నాడు. ఎంతో ఎఫర్ట్ పెట్టి సినిమాలు చేస్తున్నా కూడా నితిన్‌కి మంచి హిట్ అనేది రావడం లేదు. ఎల్లమ్మ చిత్రం అయిన నితిన్‌కి మంచి విజయం అందించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com